పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా తెనాలి భార్గవి బాధ్యతల స్వీకరణ



**కాకినాడ, పెన్ పవర్ జూలై 6:** తిరుపతి జిల్లాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న తెనాలి భార్గవి పదోన్నతిపై కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నియమితులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెనాలి భార్గవి తెలిపారు.


## సామాజిక న్యాయానికి ప్రతీక బాబూ జగ్జీవన్ రామ్.

సీనియర్ ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు పెందుర్తి యాకోబు, మండల అధ్యక్షుడు లంక శ్యామ్



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 06;** సామాజిక సమానత్వం,అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానేత బాబూ జగ్జీవన్ రామ్ అని సీనియర్ ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు పెందుర్తి యాకోబు, ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లంక శ్యామ్ అన్నారు. వారి ఆధ్వర్యంలో సోమవారం బాబూ జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన ఆలమూరులో ప్రభుత్వ ఆసుపత్రి సమీపం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో విశిష్ట ముద్ర వేసిన మహానేత అని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాసేవకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేమగిరి మున్నా,మెరిపే డేవిడ్,గిరికపూడి రాజు, పెందుర్తి సుబ్బారావు, తాతపూడి సత్తి పండు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలి





- జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 347 అర్జీలు స్వీకరణ
- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు

**కాకినాడ, పెన్ పవర్ జూలై 6:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, డీఆర్ఓ డా.టి.తిప్పేనాయక్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు అధికారి జె. వేణుగోపాల్, డీడీఓ పి.వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా బియ్యం కార్డుల మంజూరు,కార్డుల్లో పేర్ల మార్పులు,పింఛన్లు, ఉపాధి అవకాశాలు, మురికి కాలువల ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 347 అర్జీలు అందాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ సత్వర విచారణ చేపట్టి అర్జీదారులకు తగిన పరిష్కారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని సూచించారు. అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకటలక్ష్మి,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్ఓ డా. తిప్పేనాయక్‌తో కలిసి డివిజన్, మండల స్థాయి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో అందిన అర్జీల పరిష్కార పురోగతితో పాటు ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో అందిన అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



### జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి

**కాకినాడ, పెన్ పవర్ జూలై 6:** కడప జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. పద్మజ పదోన్నతిపై కాకినాడ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా నియమితులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తానని డిప్యూటీ డైరెక్టర్ బి. పద్మజ తెలిపారు.

## సారా బాధితుల పునరావాసానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.5 లక్షల విరాళం




**కాకినాడ, పెన్ పవర్ జూలై 6:** కాకినాడ జిల్లాలో సారా తయారీ, విక్రయాల కేసుల్లో పట్టుబడి ఆ వృత్తికి అలవాటు పడిన వ్యక్తులను పునరావాసం కల్పించి సమాజంలో ప్రధాన ప్రవంతిలోకి తీసుకురావడానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్కు రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేసింది.ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన పునరావాస కార్యక్రమానికి మద్దతుగా నిలిచిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు.అందించిన నిధులను సారా తయారీ, విక్రయాల నుంచి బయటపడి కొత్త జీవితం ప్రారంభించాలని ఆశిస్తున్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. బాధితులకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు అవసరమైన చేయూత అందించి, గౌరవప్రదమైన జీవితం గడిపేలా అన్ని విధాలా సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కు నివాళు లర్పించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 06;** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, గొప్ప సామాజిక సంస్కర్త, దళితుల అభ్యున్నతికి విశేష సేవలందించిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆలమూరు మండలం మడికి గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కి ఘనంగా నివాళులర్పించారు.




# రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరణ చేయొద్దు

- జీవో 396 రద్దు చేసి లైసెన్సులు పునరుద్ధరించాలి
- పిఠాపురంలో నల్ల బ్యాడ్జీలతో దస్తావేజు లేఖర్ల నిరసన

**పిఠాపురం,పెన్ పవర్,జులై 06:** రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేటీకరించవద్దని, జీవో నెం.396ను వెంటనే రద్దు చేసి దస్తావేజు లేఖర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం, దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పిఠాపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లను వివరిస్తూ సబ్-రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు యాదల పాపారావు మాట్లాడుతూ... ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే విధానాలను ప్రభుత్వం కొనసాగించాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు పేరుతో శాఖ సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని కోరారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే దస్తావేజు లేఖర్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. అందువల్ల లైసెన్సులను పునరుద్ధరించి, జీవో 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర నాయకులు మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణ వల్ల దస్తావేజు లేఖర్లు మాత్రమే కాకుండా స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల ఉపాధి కూడా ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విధుల బహిష్కరణ కారణంగా ఒక్కరోజులోనే పిఠాపురంలో సుమారు రూ.10 లక్షల విలువైన రిజిస్ట్రేషన్ లావాదేవీలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు అవసరాల వెంకట రామారావు, కేదార్ శెట్టి వెంకట మల్లేశ్వరరావు, భగవాన్, గంగాధరి, వెన్న బాబ్జి, జైకృష్ణ, దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## కూటమి హయాంలో పల్లెలకు పట్టాభిషేకం

* ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 6:** కూటమి ప్రభుత్వ పాలనలో సీఎం చంద్రబాబు విజన్ తో పల్లెల రూపురేఖలు మారుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి పల్లెల గడప తొక్కుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కోటి 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన రాజుపాలెం నుంచి రామవరం వెళ్లే మార్గంలో, రామవరం నేషనల్ హైవే నుంచి ముత్యాలమ్మ తల్లి చెరువు వరకు మెయిన్ రోడ్ ను సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు.

ఈ రోడ్డు పనులు గత టీడీపీ ప్రభుత్వంలోనే మొదలయ్యాయి. వైసీపీ హయాంలో కాంట్రాక్టర్ కు బిల్లులు రాక ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ ఊపందుకున్నాయి. డీఈ, కెఎస్ రాఘవరావు, సీఈని స్పాట్ కు తీసుకొచ్చి పరిస్థితి చూపించారు. ఎమ్మెల్యే నెహ్రూ సంబంధిత మంత్రితో స్వయంగా మాట్లాడి నిధులు సాధించారు. రోడ్డు పనులను అతి తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

"వైసీపీ పాలనలో పల్లెల అభివృద్ధి పడకేసింది. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వక రోడ్లు ఆగిపోయాయి. చంద్రబాబు విజనరీ ఆలోచనలతో కూటమి ప్రభుత్వం రాగానే పల్లెలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. రామవరం రోడ్డు ఆగిపోవడానికి కారణం వైసీపీ నిర్లక్ష్యమే. ఇప్పుడు మేం దాన్ని పట్టాలెక్కించాం. ఇది పల్లెలకు పట్టాభిషేకం. మాట ఇచ్చాం, చేసి చూపిస్తాం. అని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, ఎంపీపీ తోట రవి, అనుకుల శ్రీకాంత్, నీలం శ్రీను, కాంట్రాక్టర్ మద్దాల ధర్మాజీరావు సర్వసిద్ధి లక్ష్మణరావు, మండపాక చిన్న, ఏ ఈ డి సత్యశివప్రసాద్, ఎఫ్ఏసి రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

## 2002 ఓటరు జాబితాపై రాజకీయ చర్చ.. 2026 ఓటర్ల నమోదుపై సందేహాలు.

* స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయి ఓటర్ల జాబితా రూపొందించాలి.




**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** దేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడంపై ఏలేశ్వరం పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద చర్చనీయాంసంగా తయారైంది. 2026 నాటి తాజా జనాభా, అర్హతల ఆధారంగా ఓటర్లను నమోదు చేయకుండా 2002 జాబితాను ఎందుకు ఆధారంగా తీసుకుంటున్నారనే ప్రశ్నలు రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతున్నాయి.అయితే ఎన్నికల సంఘం వివరణ ప్రకారం, 2002 ఓటరు జాబితా కేవలం ధృవీకరణకు మాత్రమే ఆధారంగా ఉపయోగిస్తున్నామని, కొత్తగా అర్హత పొందిన 18 ఏళ్లు నిండిన యువతతో పాటు ఇతర అర్హులందరికీ అవసరమైన పత్రాలు సమర్పించి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపింది.ఈ ప్రక్రియ ద్వారా డూప్లికేట్ పేర్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను గుర్తించి ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొంటున్నారు. కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో చాలామంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని, కావాలనే దురుద్దేశంతో కొన్ని ఓట్లను తొలగించేందుకు, అధికార పార్టీ తమ సొంత వర్గాల నుంచి ఓట్లను దక్కించుకునే ప్రయత్నమే అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు ప్రతిపక్ష పార్టీలు,కొన్ని పౌరసంఘాలు మాత్రం పాత జాబితాను ఆధారంగా తీసుకోవడం వల్ల నిజమైన ఓటర్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ఈ అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2026 లో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక జనాభా గల ఎస్సీ , బీసీ వర్గాలకు దామాషా పద్ధతిన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందని, అలాగే ప్రభుత్వ నిధుల్లో ఆయా వర్గాలకు కేటాయించ వలసి వస్తుందని అందువల్లే పూర్తిస్థాయి ఓటర్ల జాబితా తయారీలో ప్రభుత్వాలు మీనమీషాలు లెక్కిస్తున్నాయని ప్రజల నుంచి పలు సందేహాలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా 2026 స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్ జన్మదిన వేడుకలు







**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 06:** ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి వాటిద్వారా పర్యావరణాన్ని కాపాడాలని వైసిపి సోషల్ మీడియా అధ్యక్షులు సొసైటీ మాజీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. ఆయన స్వగృహంలో జరిగిన జన్మదినం సందర్భంగా అభినందనలు తెలిపిన ప్రతీ ఒక్కరికి మొక్కలను అందచేసారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని వారిని దుస్తులు అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు, అమలాపురం పార్లమెంటు మాజీ సభ్యురాలు చింతా అనూరాధ, పినిపే శ్రీ కాంత్, అంబాజీపేట ఎం.పి.పి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటిసి బూడిద వరలక్ష్మి, చెల్లుబోయిన శ్రీను, పాముల రాజేశ్వరి, పేరి కామేశ్వరరావు, వంటెద్దు వెంకన్నాయుడు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు, కుడుపూడి బాబు, పేరి శ్రీనివాసరావు గొవ్వాల రాజేష్, దొమ్మేటి సాయకృష్ణ, గన్నవరపు శ్రీ నివారావు, రవణం రాము మట్టపర్తి నాగేంద్ర, వివిధ పార్టీ ల నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రంలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి స్మగ్లింగ్.





* 26 లక్షల35 వేలు విలువ చేసే 52.7 కిలోలు గంజాయి పట్టివేత.
* ట్రాక్టర్ స్వాధీనం,నిందితుడికి రిమాండ్
* వివరాలు వెల్లడించిన పెద్దాపురం డిఎస్పి, ఏబిజి తిలక్.

**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 6:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి జాతీయ రహదారిపై పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది.ట్రాక్టర్‌కు అమర్చిన వ్యవసాయ యంత్రంలో రహస్యంగా దాచి తరలిస్తున్న 26 లక్షల 35 వేల రూపాయలు విలువ చేసే 52.7 కిలోల గంజాయిని కిర్లంపూడి పోలీసులు స్వాధీనం చేసుకుని ఒక నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పెద్దాపురం డీఎస్పీ ఏబీజి తిలక్ పర్యవేక్షణలో,జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్,బి తిరుపతి రావు ఆధ్వర్యంలో,కిర్లంపూడి ఎస్సై జి సతీష్ కుమార్ నేతృత్వంలో కిర్లంపూడి పోలీసులు ఈగల్ బృందం సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.డీఎస్పీ ఏబీజి తిలక్ వెల్లడించిన వివరాలు ప్రకారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామ శివారులోని జాతీయ రహదారి-16 పై వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏపీ 39 టీకే 3260 నంబర్ గల ఆకుపచ్చ రంగు ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా,ట్రాక్టర్‌కు అమర్చిన బుల్‌అగ్రో వ్యవసాయ యంత్రంలో రహస్యంగా దాచిన 25 ప్యాకెట్లలో మొత్తం 52.7 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.వెంటనే గంజాయి,ట్రాక్టర్,బుల్‌అగ్రో వ్యవసాయ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో కూచిపూడి ఫ్రాన్సిస్ (57) అనే వ్యక్తిని అరెస్టు చేశారు.అతడు కృష్ణా జిల్లా గన్నవరం మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందినవాడని పోలీసులు తెలిపారు.అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.గంజాయి అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠా,సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా జగ్గంపేట సీఐ,బి తిరుపతిరావు,ఎస్సై జి సతీష్ కుమార్,కిర్లంపూడి పోలీస్ స్టేషన్ సిబ్బందిని,ఈగల్ టీంను ఉన్నతాధికారులు అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్య పరిరక్షణ

**10 పారిశుధ్య రిక్షాలు, డస్ట్‌బిన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**





**కొత్తపేట,పెన్ పవర్,జూలై 6:** ప్రజారోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రతే ప్రధాన ఆధారమని, స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తపేట మండలంలోని అవిడి-2, బిళ్లకుర్రు-1, గంటి-1, ఖండ్రిగ-1, కొత్తపేట-2, మోడేకుర్రు-2, పలివెల-1 గ్రామ పంచాయతీలకు మొత్తం 10 పారిశుధ్య రిక్షాలు, డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తతో పాటు హానికర, ప్రమాదకర వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పారిశుధ్య నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులను ఆయన అభినందించారు.

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు బ్యాటరీ ఆపరేటెడ్ హైడ్రాలిక్ చెత్త సేకరణ వాహనాలను కనీసం 50 వరకు అందించాలంటూ అధికారులతో చర్చించి, అవసరమైన నిధులను కోరినట్లు వెల్లడించారు.

పారిశుధ్యం కేవలం అధికారుల బాధ్యత కాదని, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు తమ బాధ్యతగా భావించి ఇంటి నుంచి వీధి వరకు పరిశుభ్రత పాటిస్తేనే స్వచ్ఛమైన గ్రామాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలందరూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములై పరిశుభ్ర సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్, జూలై06:** జనసంఘ వ్యవస్థాపకులు, మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి ని పురస్కరించుకుని సోమవారం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం లో బిజెపి గండేపల్లి మండల పార్టీ అధ్యక్షులు తోరాటి వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ 33 ఏళ్లకే కలకత్తా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా,స్వతంత్ర భారత తొలి పరిశ్రమల శాఖ మంత్రిగా ముఖర్జీ చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బలిరెడ్డి కృష్ణార్జున,సిరిదెల్ల అబ్బులు,కాపు గంటి మురళి,గుల్లపూడి సాయి, యర్రంశెట్టి శ్రీను,బీజేపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవస్వామి నిత్య అన్నదానానికి భక్తులు విరాళం




**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 6:** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఐదు వరుస బుధవారాలు స్వామివారికి ఐదు ప్రదక్షిణలు చేసి దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులలో ప్రగాఢ విశ్వాసం నెలకొంది.

సోమవారం ఆలయ సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి శేషాచార్యులు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెంకు చెందిన కల్లం శేషారెడ్డి, పద్మావతి దంపతులు, అలాగే జొన్నల శ్రీనివాసరెడ్డి, లక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రూ.5,058 విరాళంగా సమర్పించారు.

అనంతరం ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాస్ దాతలను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, వారి సేవాభావాన్ని అభినందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కొండయ్య దొర ఆరోవ వర్ధంతి పురస్కరించుకుని చీరలు పంపిణి






**గండేపల్లి, పెన్ పవర్, జూలై0 6:** ప్రజానాయకుడు, ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి స్వర్గీయ కందుల కొండయ్య దొర అని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కశీదుల చిట్టిబాబు అన్నారు. గండేపల్లి మండలం
జడ్.రాగంపేట గ్రామంలో కందుల కొండయ్య దొర ఆరోవ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందులో చిట్టిబాబు మాట్లాడుతూ తెదేపా హయంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, సివిల్ సప్లై డైరెక్టర్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడిగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి అన్నయ్య కొండయ్య దొర అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో తెదేపా కష్ట సమయంలో ఉండగా ఇన్చార్జి బాధ్యతలు చేపట్టి కార్యకర్తలను నియోజకవర్గాన్ని కాపాడుకున్న వ్యక్తి కొండయ్య దొర అని కొనియాడారు. గండేపల్లి మండలంలో పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా ఎంపీపీ, జడ్పీటీసీ లకు పోటీయే ఉండేది కాదని అన్నారు. పుట్టింది రాగంపేటలో అయినా మురారి గ్రామంలో ఉంటూ మండలానికి, నియోజకవర్గానికి సేవలు అందించేవరని కొనియాడారు. కష్టం అంటూ తన గుమ్మం తలుపు తట్టిన ప్రతి ఒక్కరికి ఆర్థికంగా చేయుతనందించి అటూ రాజకీయం లోనూ, సేవా కార్యక్రమం లోనూ చెరగని ముద్ర వేసుకుని ప్రజల మనసులో స్థిర స్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొండయ్య దొర విగ్రహానికి పూలదండలు వేసి ఇన్ని వాళ్ళు అర్పించారు. అనంతరం ఓ. రాగంపేటలోని మహిళలందరికి చీరలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో జాస్తి వసంత్,కందుల విజయ్, కందుల వినయ్, కందుల బాబ్జి, ఉండవల్లి ప్రసాద్, కంటే సురేంద్ర, కంటే రాజు, కందుల చౌదరి, మురారి, జడ్.రాగంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వాడపల్లి వెంకన్న సన్నిధిలో అష్టోత్రం, నిత్య కళ్యాణంలో పాల్గొన్న భక్తులు





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 6:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచి సోమవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.ఆలయ సన్నిధిలో అష్టోత్తర శతనామార్చన, నిత్య కళ్యాణోత్సవం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఏడు వారాల నోమును ఆచరించే భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సకల శుభాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేపట్టగా, పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగాయి.

# కూటమి ప్రభుత్వం తక్షణమే 396 జిఓను రద్దు చేయాలి.

**-ప్రత్తిపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయం వద్ద పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించిన దస్తావేజు లేఖర్లు.**




**పెన్ పవర్ జూలై 6:**కాకినాడి జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు సోమవారం పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. 396 జీఓను తక్షణమే రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెంబర్ 396తో తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రైవేట్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా జరిగే ప్రతి దస్తావేజు లావాదేవీపై రూ. 2,000 అదనపు రుసుము వసూలు చేయనున్నారన్నారు. ఇది నేరుగా సామాన్య, మధ్యతరగతి ప్రజల పై భారం పడుతుందన్నారు. తక్షణం ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచదార నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు, చిలకమర్తి వెంకటరమణ, మదినే వెంకన్నదొర, రాయవరపు హనుమంతరావు, పంచదార రాంబాబు, సింగిలిదేవి సత్యనారాయణ,శిడగం వెంకటరమణ, గళ్ళా మధుబాబు, మంచికంటి శ్రీనివాసభారతి, పలువురు దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

# కొత్తపేటలో విద్యుత్ డీఈ తాత్కాలిక కార్యాలయ ఏర్పాటుకు భవనాల పరిశీలన



**కొత్తపేట, పెన్ పవర్,జూలై 6:** కొత్తపేటలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భవనాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను పరిశీలించి, తాత్కాలిక కార్యాలయం నిర్వహణకు ఏ భవనం అనుకూలంగా ఉంటుందనే అంశంపై అధికారులతో చర్చించారు.కొత్తగా ఏర్పాటైన విద్యుత్ డీఈ కార్యాలయం ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు విద్యుత్ సేవలు వేగవంతం అవుతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, భవనం అనుకూలత, ప్రజలకు అందుబాటు వంటి అంశాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. తాత్కాలిక కార్యాలయం త్వరగా అందుబాటులోకి రావడం ద్వారా కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు విద్యుత్ శాఖ సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని అధికారులు తెలిపారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరాటే ఛాంపియన్ షిప్ లో ఏలేశ్వరం విద్యార్థుల ప్రతిభ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** కాకినాడలో ఆదివారం నిర్వహించిన సెకండ్ ఇంటర్ డిస్టిక్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో ఏలేశ్వరం కి చెందిన విద్యార్థులు అత్యున్నత ప్రతిభను కనబరిచి బహుమతులతో పాటు పలువురు ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ ఎమ్. ఎస్. కుమార్ మాట్లాడుతూ తమ వద్ద శిక్షణ పొందుతున్న గొంతిన అఖిల్ కుమార్ సీనియర్ విభాగంలో గెలుపొందారని, ద్వితీయ శ్రేణి స్పారింగ్ విభాగంలో పి ప్రవీణ్ విజయం సాధించారన్నారు. వీరికి ఆర్గనైజింగ్ కమిటీ చీఫ్ శంకర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు అన్నారు. అలాగే బెస్ట్ కోచ్ విభాగంలో కుమార్ కు అభినందనలతో పాటు ఘనంగా సత్కరించారు అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆత్మవిశ్వాసం తో పాటు శరీర దారిద్యం కూడా పెంపొందుతుందని. ప్రధానంగా బాలికలు కరాటేలో శిక్షణ పొంది ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఇటీవల మహిళలపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలంటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరిగా శిక్షణ పొందాలని ఈ సందర్భంగా కుమార్ సూచించారు.

# ఏలేశ్వరంలో నత్తనడకన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ.

- ప్రచార సాధనాలను సరిగా వినియోగించని అధికారులు.
- అధికారులకు సహకరించని రాజకీయ నాయకులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** ఏలేశ్వరం పట్టణం, రూరల్ పరిధిలో భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ నతనడకన సాగుతుంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన అంశాలను ప్రజల్లో భారీ ఎత్తున ప్రచారం నిర్వహించవలసి ఉండగా, కేవలం మున్సిపాలిటీ ఆఫీసులో, గ్రామపంచాయతీలలో నోటీస్ బోర్డులో పెట్టి ఊరుకున్నారు. ప్రచార సాధనాలను సరిగా వినియోగించలేదని అధికారులపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. 20 వార్డులు ఉన్న మున్సిపాలిటీలో ప్రతి వార్డులో, సచివాలయాల్లో ఓటర్ జాబితా తయారీ విధానం పై విస్తృత ప్రచారం చేయవలసిన అవసరం ఉంది. కానీ అది సక్రమంగా ప్రజలకు చేరలేదు. ఈ ఓటర్ల నమోదు ప్రక్రియలో ఒక బూత్ లెవెల్ ఆఫీసర్, రాజకీయ పక్షం నుంచి బూత్ లెవెల్ ఏజెంట్లు సమక్షంలో ఓటర్ నమోదు ప్రక్రియ జరగాలి. కానీ అలా జరగలేదు. ముఖ్యంగా రాజకీయ నాయకులు తమ బిఎల్ఎ లను సకాలంలో అందించలేదు. కొంతమంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్ నమోదు ఎలా చేయాలో కూడా తెలియని పరిస్థితి. దీనికి తోడు రాజకీయ పక్షాలు అధికారులకు సహకరించలేదు. కారణం వారికి కూడా సరైన అవగాహన లేకపోవడమే. ప్రజలను చైతన్య పరచవలసిన రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు నెమ్మక్కు నీరెత్తినట్లు ఉండడం గమనార్హం. ఎందుకంటే 2002 ఓటర్ల సవరణ గానే అందరికీ అర్థమైంది. 2026 ఓటర్ల నమోదు ప్రక్రియగా నాయకులకు అర్థం కాకపోవడం విచిత్రమే. ఇదిలా ఉండగా ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తికి ఓటు కల్పించే వరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# టేబుల్ మరియు కుర్చీలు వితరణ



**అల్లవరం,పెన్ పవర్, జూలై 06:**ముమ్మిడివరం మండలం ఠాణేలంక గ్రామం నందుగల ఠాణేలంకమొల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛార్టిబుల్ ట్రస్ట్ గోడిలంక మరియు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛార్టిబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం టేబుల్ మరియు కుర్చీలను బహూకరణ చేసారు. ఈ సందర్భంగా మోసుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా ముగ్గురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని, మీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని, మీరంతా బాగుగా చదువుకుని మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలని, తద్వారా పాఠశాలకు, గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.రమేష్ రాజు విద్యార్థులకు ఆశీస్సులు తెలియజేశారు.గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు ఈ రెండు ట్రస్టులు పలుచోట్ల చేస్తున్న విద్య వైద్య సేవలను ప్రశంసిస్తూ అభినందించారుకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.హిమబిందు, ట్రస్ట్ అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు,మోసుగంటి.వెంకటేశ్వరరావు,విద్యా కమిటీ ఛైర్మన్ కె.పరమేశ్వరి ,గ్రామ పెద్దలు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.వి.వి.సత్యనారాయణరాజు,జి.శ్రీలక్ష్మీ,కె.రామ లక్ష్మి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

